ఎక్సైజ్ సిఐ గా శ్రీహరి రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

సాధారణ బదిలీల్లో భాగంగా చంద్రగిరి నుంచి చిత్తూరుకు ఎక్సైజ్ సిఐగా బదిలీ అయిన పి.శ్రీహరిరెడ్డి సోమవారం చిత్తూరు పట్టణ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో చిత్తూరు జిల్లా ఎన్ఫోర్స్మెంట్ స్క్వాడ్‌లో ఇన్స్పెక్టర్‌గా పనిచేశారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీహరి రెడ్డి

పాడి రైతుకు అండగా గోకులం షెడ్లు

- షెడ్డు నిర్మాణానికి 90 శాతం సబ్సిడీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ప్రభుత్వం పాడి రైతులను ఆదుకొనేలా గోకులం షెడ్ల నిర్మాణాకి 90శాతం సబ్సిడీతో షెడ్లు నిర్మాణం చేపట్టి పాడిరైతుకు ప్రోత్సాహం అందిస్తోంది. కుప్పం నియోజవర్గంలో 593 గోకులం షెడ్లు మంజురు చేసింది. జిల్లా వ్యాప్తంగా పాడి రైతుల కోసం పెద్దసంఖ్యలో గోకులం షెడ్లు మంజురు చేయనున్నారు. పాడి రైతుకు కొద్దిపాటి పొలం, షెడు వేసేందుకు స్థలం ఉంటే చాలు రాష్ట్ర ప్రభుత్వం గోకులం పేరుతో ప్రత్యేక పథకం తీసుకొచ్చింది. తెలుగుదేశం అధికారంలో ఉన్న సమయంలో పాడి రైతుల షెడ్ల నిర్మాణానికి సబ్సిడీలో రుణాలు మంజురు చేసింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకం మూలనపడింది. కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో గోకులం పేరుతో తిరిగి పాడి రైతు షెడ్లు నిర్మించుకొనేలా 90 శాతం సబ్సిడీతో షెడ్లు నిర్మాణానికి ప్రోత్సాహం అందిస్తోంది.

అర్హతలు ఇవే..

గోకులం షెడ్ల నిర్మాణానికి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందారులు అర్హులు. ఇందులో పశువుల పెంపకందారులకు 90శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందార్లకు షెడ్ల నిర్మాణం కోసం 70 శాతం రాయితీలు కల్పించింది. ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డులు కలిగిన చిన్న, సన్నకారు రైతులు అర్హులు. షెడ్ల నిర్మాణం కోసం దరఖాస్తులు రైతు సేవా కేంద్రం, మండల వ్యవసాయశాఖ కార్యాలయం, పశు వైద్యశాలల్లో అందుబాటులో ఉంచారు. పూర్తి చేసిన దరఖాస్తులతో పాటు ఆధార్‌కార్డు, షెడ్ల నిర్మాణానికి సంబంధించిన భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు, బ్యాంకు పాసు పుస్తకం నకలు సమర్పించాల్సి ఉంటుంది.

షెడ్ల నిర్మాణానికి రాయితీ ఇలా..

షెడ్డు పరిధి	యూనిట్ విలువ	రాయితీ	రైతు కట్టాల్సింది
2 పశువులకు	1,15,000	1,03,500	11,500
4 పశువులకు	1,85,000	1,66,500	18,500
6 కంటే అధికం	2,30,000	2,07,500	23,000
20 గొర్రెలు	1,30,000	91,000	39,000
మేకలు, గొర్రెలు			
50 గొర్రెలు	2,30,000	1,61,000	69,000
కోళ్లు			
100 కోళ్ళు	87,000	60,000	26,100
200 కోళ్ళు	1,32,000	92,000	39,600

మొదటగా కుప్పంలో గోకులం షెడ్ల నిర్మాణాలు ప్రారంభిస్తున్న దృశ్యం

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- ప్రభాకర్ రావు, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ

రాష్ట్ర ప్రభుత్వం గోకులం షెడ్ల నిర్మాణం పేరుతో పాడి, గొర్రెల, మేకల పెంపకందారులతోపాటు కోళ్ల పెంపకందారులు షెడ్లు నిర్మించుకునేలా సబ్సిడీతో ప్రోత్సాహం అందిస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీతో షెడ్ల నిర్మాణం చేపట్టాలి. మండలానికి 35 యూనిట్ల చొప్పున మంజురు చేయడం జరుగుతోంది.

సమాన పనికి..

సమాన వేతనం ఇవ్వాలి..

కలెక్టరేట్ ఎదుట కాంట్రాక్ట్ వర్కర్లు, ఆశాల ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేస్తున్న వివిధ రకాల కాంట్రాక్ట్, అవుట్ స్పోర్సింగ్, గౌరవ వేతనం తీసుకుంటున్న ఉద్యోగులు, డైలీ వేజ్, పార్ట్ టైం, కంటెంజెంట్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సోమవారం కలెక్టరేట్ వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ధర్నాకు సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా అధ్యక్షత వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ ప్రభుత్వసంస్థల్లోని కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ప్రభుత్వపథకాల్లో పనిచేస్తున్న వారందరికీ ఎంటిఎస్ అమలు చేయాలని, అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేసి వారి కుటుంబ సభ్యులలో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగులు రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, ఆరోగ్య బీమా అమలు చేసి కారుణ్య నియామకాలు ఇవ్వాలన్నారు. అలాగే నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష తదితర అన్ని ప్రభుత్వ పథకాల్లోనే ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, డీఏ కల్పించాలని, ఇఎస్ఐ పిఎఫ్ వర్తింపచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 2014 తర్వాత జాయిన్ అయిన వారిని మూడు, ఐదు సంవత్సరాలు సర్వీస్ ఎప్పుడు పూర్తి అయితే అప్పుడు రెగ్యులర్ చేసే విధంగా నిర్దిష్ట విధానాన్ని వెంటనే ప్రకటించాలని, 2014లోగా జాయిన్ అయిన వారందరినీ వెంటనే రెగ్యులర్ చేసి ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అందరికీ రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా గ్రాస్‌శాలరీ చెల్లించాలని, ప్రతినెలా మొదటివారంలో జీతాలు ఇవ్వాలని, వేతన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా చిత్తూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా, నలిని తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, ఆశా వర్కర్లు

నిర్ణీత గడువు లోపు అర్జీలను పరిష్కరించండి: కలెక్టర్

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజాసమస్యల పరిష్కారవేదికలో అందిన అర్జీలను నిర్ణీత గడువు లోపల పరిష్కరించడంతోపాటు అధికారులు అర్ధవంతంగా సమాధానం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని నూతన గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ, డిఆర్ఓ బి.పుల్లయ్యలు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా అందిన అర్జీలను జిల్లా శాఖాధిపతులు క్షేత్రస్థాయిలో తమ సంబంధిత సిబ్బందితో పరిష్కరించాలని, కాలయాపాయన చేయరాదని ఆదేశించారు. పరిష్కారమయ్యే సమస్యలను నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని, పరిష్కారం కాని సమస్యలకు గల కారణాలను ఫిర్యాదుదారునికి అర్ధమయ్యేలా వివరించాలని తెలిపారు. మొత్తం: 237 అర్జీలు రాగా ఇందులో శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 204, పోలీస్ శాఖ 5, డ్వామా 1, డిఆర్ డిఏ 3, వ్యవసాయశాఖ 1, పౌర సరఫరాలు 2, జిల్లా విద్యాశాఖ 1, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ 3, మద్య నిషేధ్యం 1, ఎస్‌సి కార్పొరేషన్ 1, ఫారెస్ట్ శాఖ 2, ఎల్‌డిఎం 3, ఎపిఎస్‌పిడిసిఎల్ 1, దేవాదాయ శాఖ 1, మత్యశాఖ 1, నేషనల్ హైవే 2 , ఎంపిడిఓ పెద్దపంజాణి 1, ఎంపిడిఓ పూతలపట్టు 1, హౌసింగ్‌శాఖ 2, పశు సంవర్ధక శాఖ 1, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు సమస్యలను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్, డిఆర్ఓలకు అందజేశారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు: ఎస్పీ

ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీదారుల నుంచి ఫిర్యాదులను జిల్లా ఎస్పీ మణికఠ చందోలు స్వీకరించారు. మొత్తం 45 ఫిర్యాదులు అందాయి. ప్రజాఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పి ఆదేశించారు.

పీజీఆర్ఎస్‌లో 12 వినతులు..



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీ ఆర్ఎస్) కార్యక్రమంలో 12 ఫిర్యాదులు వచ్చినట్లు నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ చెప్పారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీల పరిష్కారంపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో కమిషనర్ చర్చించారు. ఫిర్యాదులు, వినతులకు సంబంధించి సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించాలన్నారు. అనంతరం గత వారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన వినతుల పరిష్కారంపై సమీక్షించారు. ఇంజనీరింగ్ 8, రెవెన్యూ 2, ప్రజారోగ్య విభాగం 1, ప్రధాన కార్యాలయం 1 వినతులు అందాయి. సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంఈ వెంకట రామిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు దసరా మహోత్సవ ఆహ్వానం

బోయకొండ గంగమ్మ దేవస్థానంలో ఈనెల 4 నుంచి 12వ తేదీ వరకు దసరా మహోత్సవ ఆహ్వాన పత్రికను, అమ్మవారి ప్రసాదంను బోయకొండ ఆలయ ఈవో ఏకాంబరం సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్‌కు అందించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ, డిఆర్ఓ బి.పుల్లయ్యలకు ఆహ్వాన పత్రికలను అమ్మవారి ప్రసాదంను అందజేసి దసరా ఉత్సవాల్లో పాల్గొనవలసిందిగా కోరారు.

ఆహ్వాన పత్రికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తున్న ఈవో ఏకాంబరం

అస్ఫియా అదృశ్యంపై

అన్ని కోణాల్లో దర్యాప్తు..: ఎస్పీ

- 11 బృందాలతో గాలింపు
- డాగ్ స్క్వాడ్ పరిశీలన

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరులో చిన్నారి అస్ఫియా అదృశ్యంపై పోలీసులు అన్ని కొణాల్లో దర్యాప్తు చేస్తున్నారని చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఉబేదుల్లా కాంపౌండ్‌లో ఉన్న వీధులను ఎస్పీ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉబేదుల్లా కాంపౌండ్‌కు చెందిన అంజాద్ కుమార్తె అస్ఫియా (6) ఆదివారం ట్యూషన్‌కి వెళ్లి వచ్చి ఇంటి వద్ద ఆడుకుంటూ చిన్నారి అక్కడ అదృశ్యమైందని తెలిపారు. ఏడు గంటలకు అదృశ్యమైతే చిన్నారి బంధువులు, అక్కడ యువత ఆ ప్రాంతంలో అన్నిచోట్లను వెతికినా ఆచూకీ లేకపోవడంతో రాత్రి 10. 30 గంటలకు పోలీసు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులతో కలిసి యువత కూడా రాత్రంతా అన్ని ప్రాంతాలు తిరిగారిని కానీ ఆచూకి తెలీయలేదని పేర్కొన్నారు. దీంతో చిన్నారి అదృశ్యం కేసు దర్యాప్తు కోసం 11ప్రత్యేక బృందాలతో కోసం గాలింపు చేపట్టినట్లు చెప్పారు. పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే డాగ్ స్క్వాడ్ పసిగట్టిన ప్రదేశాలను సందర్శించి వివరాలు తెలుసుకోవడం జరిగిందన్నారు. సీసీ కెమెరాల్లో కూడా అన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఆర్థికపరమైన సమస్యలపై ఏమైనా జరిగాయని కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. త్వరలోనే అస్ఫియా ఆచూకీని లభిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు.



అస్ఫియా (ఫైల్ ఫొటో)

బాలిక అదృశ్యంపై కుటుంబ సభ్యులను విచారిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

పని ఒత్తిడి భరించలేం..

బీఎల్‌వోల నిరసన

నగరి ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బిఎల్‌వోలు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): పని ఒత్తిడి భరించలేక బీఎల్‌వోలు సోమవారం నగరి ఆర్‌డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ అధికారుల నుంచి పనిఒత్తిడి భరించలేకపోతున్నామని, తక్కువ సమయంలో ఎక్కువ పనులు చేయమని చెప్పడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. అలాగే గ్రామాల్లో ఇంటి నెంబర్లు మార్చడానికి వెళ్లితే ప్రజలు ఒప్పుకోవడం లేదని, ఈవిషయాన్ని అధికారులకు చెబుతుంటే ' అంది అంతా తెలీదు.. తప్పక మార్చవల్సిందేనని' అంటూ వేధిస్తున్నారని వాపోయారు. అంటు గ్రామప్రజలు, ఇటు అధికారుల మధ్య ఒత్తిడి భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తామే సర్వేచేసి, మండల, జిల్లాస్థాయి అధికారులకు తీసుకెళ్లి ఇవ్వాలని చెప్పడం దారుణమన్నారు. కనీసం పేపర్ ఖర్చులకు కూడా ఒక్క పైసా కూడా ఇవ్వడం లేదన్నారు. సొంత ఖర్చుతో ఎన్ని రోజులు పని చేయాలని అధికారులను ప్రశ్నించారు. ఉదయం 6గంటలకు నుంచి రాత్రి 9గంటలకు వరకు ఎవ్వరు పనిచేస్తారని, సమయానికి పని చేయలేదని నోటీసు జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. పనిఒత్తిడి భరించలేక ఆత్మహత్యలు చేసుకోవల్సి పరిస్థితి కూడా వచ్చిందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన బీఎల్‌వోలను వేధించడం మానుకోవాలని, పని ఒత్తిడి తగ్గించాలని డిమండ్ చేశారు. అనంతరం నగరి ఆర్‌డీవోకు వినతిపత్రం అందించారు.

'పరిసరాల పరిశుభ్రత పాటించండి'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పరిసరాల పరిశుభ్రతను పాటించి దోమలను నివారించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక మురకంబట్టు జీకే కాలనీలో డెంగీ జ్వరం కేసు వచ్చిన నేపథ్యంలో డాక్టర్ అనిల్ కుమార్ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో ఇంటిఇంటి ఫీవర్ సర్వే, లార్వాలు సర్వే నిర్వహించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట సబ్ యూనిట్ ఆఫీసర్లు రామకృష్ణ, శివ సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎ, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఎస్‌టి హ్యాబిటేషన్లలో సర్టిఫికెట్లు మంజూరు..

నవంబర్ 15 లోపు పూర్తి చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లాలోని 588 ఎస్‌టి హ్యాబిటేషన్లలో ఇంకా జనన, ఆధార్ సర్టిఫికేట్లు లేని వారికి సర్టిఫికెట్లు మంజూరు ప్రక్రియను నవంబర్ 15 లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తహశీల్దార్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. సోమవారం జిల్లాలోని ఆర్‌డిఓలు అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీఓలతో ఎస్‌టి హ్యాబిటేషన్లలో జనన, ఆధార్ సర్టిఫికెట్లకు మంజూరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పథకాలను పొందడానికి ఆధార్ ముఖ్యమని, జిల్లాలోని 588 ఎస్‌టి హ్యాబిటేషన్లలో సుమారుగా 60వేల మంది ఎస్‌టిలు ఉన్నారని, వీరిలో ఇంకా కొంత మందికి ఆధార్‌కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారని తెలిపారు. వీరందరినీ సర్వేలో గుర్తించి 100 శాతం ఆధార్ కార్డు మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు. సంచార ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆధార్ కార్డు మంజూరుకు తహశీల్దార్లు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే జనన ధ్రువీకరణ పత్రం లేనివారికి ఎంపీడీఓలు నిర్ధారించి సర్టిఫికెట్లు మంజూరు చేయడం ద్వారా ఆధార్ నమోదుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసే విషయంలో వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు పూర్తిగా నిమగ్నం కావాలన్నారు. ఈనెల 10వ తేదీ లోపు సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని, 25 లోపు బర్త్ సర్టిఫికెట్లు మంజూరు డిజిలైజేషన్ పూర్తిచేసి నవంబర్ 15లోపు ఆధార్ కార్డుకు అప్లోడ్ చేయాలని, ఈ దిశగా మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, అధికారులు పాల్గొన్నారు.

దళితునిపై దాడి

- తిరిగి అతని పైనే కేసు నమోదు
- పోలీసుల వింత పోకడ

ప్రజాశక్తి- పుంగనూరు:

దళితవర్గానికి చెందిన గోవిందును ఆ గ్రామ పెత్తందారులు విచక్షణారహితంగా దాడి చేసి తిరిగి వారికున్న బలంతో అతనిపైనే కేసు కట్టించిన ఘనత అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలో చోటు చేసుకున్నది. సదరు దళితుడు గాయాలపాలై పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా జిల్లా మాల మహానాడు నాయకులు పరామర్శించి అతనికి అండగా నిలిచి భరోసా ఇచ్చారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల కేంద్రంలోని దిగువ హరిజనవాడకు చెందిన గోవిందు అనే యువకున్ని అదే ఊరుకు చెందిన ఆదినారాయణ రెడ్డి, ధనంజయ రెడ్డి, రాము, ఉదయకుమార్ అనే వాళ్ళు వారి టమోటా తోటలో దొంగతనం చేశాడని ఆరోపించారు. ఈ నేపంతో అతన్ని కులం పేరుతో దూషించి మర్మాంగాలపైన దాడి చేసి విచక్షణారహితంగా కొట్టి గాయపరిచారు. అయితే రామసముద్రం పోలీసులు దెబ్బలు తిన్న వారిపైన కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మాల మహానాడు నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటామని, న్యాయం జరిగేలాగా చూడాలని కేసును పూర్తిగా విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పోలీస్‌స్టేషన్ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అశోక్, గుండా మనోహర్, మల్లెల మోహన, యమాల చంద్రయ్య, రామసముద్రం అధ్యక్షులు కృష్ణప్ప, జయరాజు, నారాయణ పాల్గొన్నారు.

ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

వరద బాధితులకు రూ.10 లక్షల విరాళం

ముఖ్యమంత్రికి విరాళం చెక్కును, లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం విజయం విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు కళాశాల యాజమాన్యం రూ.10,00,116లను అందజేశారు. సోమవారం ఉండవల్లిలో పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే మురళి మోహన్, విజయం విద్యాసంస్థల అధినేత డాక్టర్ తేజోమూర్తి, అకాడమిక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ శైలజ మూర్తి నగదు చెక్కును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందజేశారు. అలాగే ఇటీవల కాణిపాకం బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా గణనాథుని ఆలయంలో నిర్వహించిన లడ్డు వేలం పాటలో 21 కేజీల లడ్డు ప్రసాదాన్ని విజయం విద్యాసంస్థల అధినేత ఎం.తేజోమూర్తి రూ.4,25,000లకు దక్కించుకున్నారు ఆ ప్రసాదాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. విజయం విద్యాసంస్థల ఏవో రాజగోపాల్, లైసన్ ఆఫీసర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో మృతిచెందిన పోలీస్ కుటుంబాలకు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు సహాయనిధి ద్వారా ఆర్థిక సాయాన్ని సోమవారం అందించారు. పెనుమూరు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఈనెల 19వ తేదీ మృతి చెందిన సూరి కుటుంబ సభ్యులకు పోలీస్ రిలీఫ్ ఫండ్ నుండి లక్ష రూపాయలు, అలాగే సాయుధ దళంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఓం ప్రకాష్ ఈనెల 24వ తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఓం ప్రకాష్ కుటుంబ సభ్యులకు పోలీస్ సహాయనిధి నుండి 30 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎస్పి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎస్పీ బాదితుల కుటుంబాలకు భరోసా ఇస్తూ, పోలీస్ డిపార్టుమెంట్ తరపున వారికి అన్ని విధాల సహాయం అందిస్తామని తెలిపారు.

వంద రోజులైనా.. సమస్యలు ఇంకా జటిలం

- విషజ్వరాలు ప్రబలుతున్నాయ్.. దోమలు దండెత్తుతున్నాయ్..
- సిబ్బంది కొరతతో ఆర్‌వో ప్లాంట్‌లన్నీ మూతపడ్డాయ్..
- సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్ల ఆరోపణ

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా

ప్రజాశక్తి-పుంగనూరు: వంద రోజుల పాలనలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, వాటి పరిష్కారం కాలేదని కౌన్సిలర్‌లు ఆరోపించారు. పుంగనూరు మున్సిపల్ కార్యాలయ సమావేశపు హాల్లో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం ఛైర్మన్ అలీమ్ బాషా అధ్యక్షతన జరిగింది. వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని ఛైర్మన్ అధికారులను ఆదేశించారు. వివిధ సమస్యలపై కౌన్సిలర్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ చూసినా సమస్యలు తిష్ట వేశాయని, వంద రోజుల పాలనలో పరిస్థితి మరింత ఇబ్బందిగా తయారైందని కౌన్సిలర్ రహమతుల్లా అలియాస్ అమ్ము ఆరోపించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అమ్ము మాట్లాడుతూ తమ వార్డులో ఎక్కువమంది పేదలు నివసిస్తున్నారని, గతంలో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌ల ప్రస్తుతం మూతపడ్డట్లు వివరించారు. వేతనాలు చెల్లించక సిబ్బంది రాక ప్లాంట్ నిర్వహణ లేకపోయిందన్నారు. వెంటనే ఆర్‌వో ప్లాంట్‌లను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ త్యాగరాజు మాట్లాడుతూ కుక్కలు బెడద అధికంగా ఉందని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంగా స్పందించిన కమిషనర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కుక్కల బెడద నివారణకు తిరుపతిలో ఉన్న జంతు సంరక్షణ శాఖ వారితో మాట్లాడడం జరిగిందని త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్ రేష్మ మాట్లాడుతూ వర్షాలు పడడంతో ఎన్ఎస్ పేట రోడ్డు వైపు వెళ్లాలంటే రోడ్లన్నీ గుంతల మయం అయ్యాయని సంబంధిత అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కౌన్సిల్ అజెండాను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు కౌన్సిలర్ అమ్ము ప్రకటించగా దీనిని అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. వార్డుల్లో విషజ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పారిశుద్ధ్య పనులు చేపట్టి, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కొండవీటి నాగేంద్ర, సీఆర్ లలిత కో ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

'క్రీడల్లోనూ రాణించాలి'


క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ ఛైర్మన్

ప్రజాశక్తి-వి కోట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడుతుందని జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మండలంలోని ముదరందొడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పలమనేరు అండర్-17 జోనల్ కోకో పోటీలు జరిగాయి. జెడ్పీ ఛైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాపోటీలకు విచ్చేసిన విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. అనంతరం ముదరందొడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వారి పాఠశాలలో ఏర్పడ్డ తాగునీటి సమస్యను జెడ్పీ ఛైర్మన్ దృష్టికి తీసుకురాగా వెంటనే నిధులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దామోదర్, వైస్ ఎంపిపి లక్ష్మణ్ రెడ్డి, టీడీపీ నాయకులు రంగనాథ్, ఎంఈవో చంద్రశేఖర్, విద్యానికేతన్ విద్యా సంస్థల అధినేత దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకతను పెంచుకోవాలి

శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ సురేష్ బాబు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: విద్యార్థులు సృజనాత్మకతను పెంచుకోవాలని ప్రముఖ సైకాలజిస్ట్, ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగపు అధిపతి డాక్టర్ వై.సురేష్ బాబు తెలిపారు. డాక్టర్ వైసి జేమ్స్ ఎన్ పాలిటెక్నికల్ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ సిహెచ్ సుబ్బన్న ఆధ్వర్యంలో కళాశాలలో అవగాహన సదస్సు, శిక్షణ తరగతులను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉరవకొండ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు పాల్గొని మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్, ఆలోచన విధాన ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ సయ్యద్ హుస్సేన్ మియాన్, నరసింహులు, నిరంజన్, వరుణ్, జోసెఫ్, డాక్టర్ రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

జీడీ నెల్లూరు సీఐగా లక్ష్మీనారాయణ

సీఐ లక్ష్మీ నారాయణ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు సీఐగా లక్ష్మీ నారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అన్న మయ్య జిల్లా దిశ పోలీస్‌స్టేషన్ సీఐగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన ఇక్కడికి నియమితులైయ్యారు. సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

ఎస్ఆర్ పురం విద్యుత్ ఏఈగా విజయ శేఖర్

విజయశేఖర్

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండల విద్యుత్ ఏఈగా సోమవారం విజయశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

బంగారుపాళ్యం ఏపీఎంగా రవి

రవి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండల ఏపీఎంగా రవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పుంగనూరు నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మీరాబాయి పలమనేరు ఏపీఎంగా బదిలీపై వెళ్లారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

రోడ్డు పక్కన శుభ్రం చేయిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ కేంద్రంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. సర్పంచ్ శిరీష చాణిక్య ప్రతాప్, ఈవోఆర్‌డీ పురుషోత్తం, పంచాయతీ కార్యదర్శి రితేష్ నేతృత్వంలో గ్రామాల్లో చెత్తను శుభ్రం చేయించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు అవగాహన కల్పించారు.

'భూ సమస్యలను పరిష్కరించండి'

తహశీల్దార్‌కు విన్నవిస్తున్న రైతులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: భూ సమస్యలను పరిష్కరించాలని పలువురు రైతులు కోరారు. సోమవారం మండల తహశీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి భూ వివాదాలు, తగాదాలు పరిష్కరిస్తామని అర్జీదారులకు తహశీల్దార్ హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేను కలసిన అధికారులు

ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పలమనేరు: ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా పలమనేరుకు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన పలువురు అధికారులు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో ఎక్సైజ్ సీఐ భాగ్యలక్ష్మి, సబ్ రిజిస్టర్‌గా సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహశీల్దార్ అనిల్ కుమార్ ఉన్నారు.

న్యాయం చేయండి

కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన బాధితులు

చిత్తూరుఅర్బన్: గత 75 సంవత్సరాలుగా తమ అనుభవంలో ఉన్న భూమిని కొందరు అక్రమంగా కబ్జాకు పాల్పడుతున్నారని చిత్తూరు నగరంలోని ఇరువారం, పీహెచ్ కాలనీ, పోతంబటు గ్రామాలకు చెందిన బాధితులు వాపోయారు. ఈ మేరకు ఇరువారంకు చెందిన ఏ.రాజ్ కుమార్, భాస్కర్, వికలాంగుల కాలనీకి చెందిన హరిబాబు తమ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ ఇరువారం రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నంబర్ 263/4లోని ఏ.రాజ్ కుమార్ పేరిట ఉన్న ఒక ఎకరా, సర్వేనెంబర్ 263/1, సర్వే నంబర్ 263/2లోని భాస్కర్ పేరిట ఉన్న 68 సెంట్లు, 263/ 4లోని హరిబాబు పేరిట ఉన్న 12సెంట్లు భూమిని తమ భూములకు సమీపంలో ఉన్న మేరీ అనే మహిళ కొంతమంది అనుచరులతో కలిసి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమ ముగ్గురి భూములకు సమగ్ర డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని, గతంలో జయపాల్ రెడ్డి అనే వ్యక్తి తమ కెవ్వరికీ తెలీకుండా ఫేక్ డాక్యుమెంట్లతో ఇంటి స్థలాలుగా మార్చి గుట్టు చప్పుడు కాకుండా కొంత మందికి విక్రయించేశారని, ఫేక్ డాక్యుమెంట్లను అడ్డు పెట్టుకొని భూములు తమవంటూ తరచూ బెదిరిస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వాపోయారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

కలెక్టరేట్ ఎదుట బాధితులు

రామకుప్పం ఎంపీడీవోగా లక్ష్మీకాంత్

ఎంపీడీవోను కలిసి మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-రామకుప్పం: రామకుప్పం నూతన ఎంపీడీవోగా లక్ష్మీకాంత్ సోమవారం భాధ్యతలు చేపట్టారు. నూతన ఎంపీడీవోని పలువురు టీడీపీ నాయకులు కలిసి శుభాభినందనలు తెలిపారు. ఆనందరెడ్డి, నరసింహులు, రామకృష్ణప్ప, సుబ్రీ, విశ్వనాథ్, వెంకటాచలం తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

డీటీగా అశోక్ కుమార్

అశోక్‌కుమార్

రామకుప్పం మండల రెవిన్యూ కార్యాలయంలో నూతన డిప్యూటీ తహశీల్దార్‌గా అశోక్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ దిలీప్ రొంపిచర్లకు బదిలీపై వెళ్లారు.

విద్యుత్ ఏడీఈగా చంద్రనాయక్

చంద్రనాయక్

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరం విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా చంద్ర నాయక్ సోమవారం బాధ్యతల చేపట్టారు. ఈయన నాగలాపురం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. కార్వేటినగరంలో పనిచేస్తున్న ఏడిఈ నాగరాజు బదిలీపై తిరుపతికి వెళ్లారు.

ఏపీఎంగా కవిత

కవిత

మండల ఏపీఎంగా కవిత సోమవారం బాధ్యతలు చేపట్టారు. వెదురుకుప్పం మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఎం విజయ్ కుమార్ తిరుపతికి బదిలీపై వెళ్లారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈగా సతీష్ కుమార్

సతీష్ కుమార్

కార్వేటినగరం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈగా సతీష్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. నగిరి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శైలజ కుమారి సత్యవేడుకు బదిలీపై వెళ్లారు.

కోలాహలంగా సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవాలు


స్వామివారి సేవలో కుప్పం ఆర్‌డీవో, రూరల్ సీఐ

ప్రజాశక్తి-రామకుప్పం: మండల కేంద్రంలోని శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి సోమవారోత్సవాలు నాలుగవ వారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తాదులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కుప్పం ఆర్‌డీవో శ్రీనివాస రాజు, కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటి సభ్యులు వారికి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం చోటు చేసుకోకుండా పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గ్యాస్ బండ @ సబ్ ఏజెన్సీ

- రూ.వెయ్యి చొప్పున విక్రయాలు
- వినియోగదారుల నుంచి దండుకుంటున్న వైనం

ప్రజాశక్తి-గంగవరం: సాధారణంగా గ్యాస్ బండ దొరికేది సంబంధిత గ్యాస్ ఏజెన్సీల వద్దనే. అయితే ఈ సబ్ ఏజెన్సీలు ఏంటనుకుంటున్నారా.. ఈ కథ చదవండి. మండలంలోని అన్ని ప్రాంతాలకు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులే గ్యాస్ బండను సప్లై చేయాల్సి ఉంది. అయితే దూరాన్ని బట్టి కొంత అధనపు సొమ్ము వసూళ్ల చేస్తారు. కానీ ఇక్కడ సకాలంలో గ్యాస్ సిలిండర్‌లను ఊళ్లలో సరఫరా చేయకపోగా సబ్ ఏజన్సీల రూపంలో పది, ఇరవై గ్యాస్ బండలు చొప్పున ఒక్కోరి వద్ద చేర్చి అధిక మొత్తంలో రూ.వెయ్యి అంతకంటే ఎక్కువ వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. సిలిండర్ ధర రూ.839.50ఉండగా సబ్ ఏజెన్సీ (ఏజెన్సీ నిర్వాహకులకు అనుకూల వ్యక్తుల వద్ద) వద్ద రూ.వెయ్యి చొప్పున విక్రయిస్తున్నట్లు తెలియవచ్చింది. ఈ వ్యవహార మంతా అధికారుల దృష్టిలో ఉన్నా పట్టించుకోలేదని, అధిక మొత్తంలో సొమ్ము తీసుకుంటున్నట్లు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

సబ్ ఏజెన్సీ వద్ద తీసుకున్నా..

గ్యాస్ ఏజెన్సీ నిర్వాహ కులు రాకపోవడంతో సబ్ ఏజెన్సీ వద్ద సిలిండర్ తీసుకోవాల్సి వచ్చింది. రూ.వెయ్యి తీసుకొని గ్యాస్ బండ ఇచ్చారు. ఏజెన్సీ నిర్వాహకులు తీరు మార్చుకోవాలి. అధికారులు పట్టించుకోవాలి. ఏజెన్సీ నిర్వాహకులు ఊళ్లలోకి వచ్చి సరఫరా చేయాలి.

- లోకేష్, వినియోగదారులు, గంగవరం

ఎమ్మెల్యే చొరవ.. గ్రామానికి సిసి రోడ్డు నిర్మాణం

సిసి రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లి పంచాయతీలో పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి సహకారంతో రూ.10లక్షలతో సీసీ రోడ్ల నిర్మిస్తున్నట్లు మాజీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి సి.భాను ప్రతాపరెడ్డి అన్నారు. సోమవారం ఉపాధి హామీ పథకం నిధుల నుంచి సిసి రోడ్లు మంజూరు చేయించి పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. పంచాయతీరాజ్ డివిజన్ ఇంజనీర్ మహేష్, పంచాయతీరాజ్ ఇంజనీర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, సిసి రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు. మంజునాథరెడ్డి, గణేష్, యమునా, కృష్ణారెడ్డి, బాలకృష్ణారెడ్డి, మునీంద్ర, ఆది, నాగరాజ్ యాదవ్, ధనరాజ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం చంద్రబాబుకే సాధ్యం: దాము

ప్రజల వద్ద వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-కుప్పం టౌన్: ప్రజా సంక్షేమం చంద్రబాబుకే సాధ్యమని పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము తెలిపారు. సోమవారం పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 19వ వార్డు పరిధిలో జరిగిన వార్డు బాట కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజులలో చంద్రబాబు పేద ప్రజలకు అందజేసిన సంక్షేమాన్ని వివరించారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తూ, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జాకీర్ అహ్మద్, సోము, గోపీనాథ్, మంజునాథ్, నరేష్, భాగ్యలక్ష్మి, త్రిలోక్ తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్డుకు భూమి పూజ

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ ఎస్సీ కాలనీలో స్థానిక టిడిపి నాయకులు చెక్కునత్తం మణి సోమవారం గోకులం షెడ్‌కు భూమి పూజ చేశారు. లబ్ధిదారుడు, పాడి రైతు శంకరప్ప మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పాడి రైతులకు ఆవుల షెడ్డులు మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాడి రైతులు పాల్గొన్నారు.

అమ్మపల్లిలో జోరుగా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండలంలోని అమ్మపల్లి పంచాయతీలోని కృష్ణాపురం, అమ్మపల్లి, రాచపల్లెం, సూరయ్య పాల్యం, ఎంఆర్ కండిగ గ్రామాలలో సోమవారం పార్వతీ పనులు సర్పంచ్ భారతి ఆధ్వర్యంలో జోరుగా జరిగింది. గ్రామాల్లో పిచ్చి మొక్కలు, డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయించారు. అక్కడక్కడ బ్లీచింగ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వాణి, స్వాతి, మండల కోఆర్డినేటర్ ఏకాంబరం, సచివాలయం సిబ్బంది, ధనశేఖర్ వర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువుల గర్భకోశ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-సదుం: పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో సదుం పశువైద్యశాల డాక్టర్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సోమవారం జోగివారిపల్లిలో పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 200ఆవులకు గర్భకోశ వ్యాధులు, నట్టల వ్యాధులపైన, పిడుదల సమస్యలు పైన, పశు వైద్య డాక్టర్లు చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రహ్మణ్యం పాడి పశువులకు వచ్చే గర్భకోశ వ్యాధులు, నట్టల నివారణ, పిడుదులు నివారణ తదితర అంశాలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస నాయుడు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ తబరేజ్ బాషా, డాక్టర్ మునిచంద్ర, డాక్టర్ చందన ప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి-సోమల: సోమల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న సయ్యద్ ఫరూక్ రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు సోమవారం వ్యాయామ ఉపాధ్యాయులు కరుణానిధి తెలిపారు. ఈనెల 29వ తేదీన గ్యారంపల్లెలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్ 19 త్రో బాల్ ఎంపిక పోటీలు జరిగాయని, ఈ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచిన సయ్యద్ ఫరూక్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అదేవిధంగా కందూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న లహరి, రుచిత, దినేష్, రాహుల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు చిన్నప్ప తెలిపారు. త్వరలో విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు. పలువురు సయ్యద్‌ని అభినందించారు.

సక్షం అంగన్వాడీ కార్యక్రమం ప్రారంభం

ప్రజాశక్తి-శాంతిపురం: ఐసిడిఎస్ ప్రాజెక్ట్ శాంతిపురం అరిముత్తనపల్లి అంగన్వాడి కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సక్షం అంగన్వాడీ కార్యక్రమాన్ని ప్రాజెక్టు ఆఫీసర్ కల్పన ప్రారంభించారు. కార్యక్రమంలో మండలంలోని 19 అంగన్వాడీ కేంద్రాలకు, రామకుప్పం మండలంలో 19అంగన్వాడీ కేంద్రాలును అప్ పగ్రేడేషన్‌కు ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. ఎంపికైన సెంటర్లకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను కేంద్ర ప్రభుత్వం ద్వారా కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విశ్వనాధ్ నాయుడు, అంగన్వాడీ సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవ వైవిధ్య సమతుల్యత సమిష్టి బాధ్యత

ప్రజాశక్తి-సదుం: జీవ వైవిధ్య సమతుల్యత మన అందరి సమిష్టి బాధ్యత అని విజ్ఞాన వేదిక పర్యావరణ విభాగానికి చెందిన కన్వీనర్ సుధాకర్ అన్నారు. జీవ వైవిధ్యంపై, జన విజ్ఞాన వేదిక సహకారంతో సదుం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయకుమార్ రెడ్డి సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక పర్యావరణ విభాగానికి చెందిన కన్వీనర్ సుధాకర్, శాస్త్రవేత్త డాక్టర్ కరీముల్లా జీవ వైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకే 'చెకుముకి'

- నేడు మండల స్థాయి పరీక్షలు

ప్రజాశక్తి-పుంగనూరు: విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన పెంపొందించడానికే జన విజ్ఞాన వేదిక చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నదని జెవివి కార్యదర్శి సుశీల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 25న పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించగా పుంగనూరు అర్బన్, రూరల్‌లోని 9 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. వీరికి మండల స్థాయిలో మంగళవారం స్థానిక మున్సిపల్ హైస్కూల్లో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని వివరించారు. హేతువాద దృక్పథాన్ని పెంపొందించడానికి జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందని పేర్కొన్నారు.

ఘనంగా ముందస్తు దసరా వేడుకలు

వివిధ వేషధారణలో విద్యార్థులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: స్థానిక శ్రీ లక్ష్మీనరసింహ విద్యా సంస్థలో ముదస్తు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థ డైరెక్టర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ విజయదశమి విజయాలకు చిహ్నంగా ఈ పండుగ జరుపుకుంటామని వివరించారు. అనంతరం విద్యార్థులు ధరించిన తొమ్మిది మహాశక్తుల అవతారాలు పలువురిని ఆకట్టుకుంది. విద్యార్థుల నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటేష్, ధనంజయ రెడ్డి, పురుషోత్తం, హెచ్‌ఎం జమున, కృష్ణవేణి, కిశోర్, నిర్మల, చందు ప్రియ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోజుకో చోట.. జోరుగా పేకాట

- రాష్ట్ర సరిహద్దులో 'కాయ్ రాజా కాయ్'
- లక్షల్లో చేతులు మారుతున్న వైనం



ప్రజాశక్తి-గంగవరం: అది రాష్ట్ర సరిహద్దు ప్రాంతం. కర్నాటక రాష్ట్రానికి అతి దగ్గర. ఎటు చూసినా మామిడి తోటలు పచ్చని పంట పొలాలు. సరిగ్గా అలాంటి ప్రాంతాన్నే ఎంచుకొని పేకాట రాయుళ్లు రెచ్చిపోతున్నారు. రోజుకో చోటు మార్చి.. జూదం ఆడుతున్నారు. ఇటు ఆంధ్ర, అటు కర్నాటక నుంచి పెద్ద సంఖ్యలో జూదరులు వస్తున్నట్లు సమాచారం ఉంది. లక్షల్లో చేతులు మారుతున్నట్లు తెలియవచ్చింది. ఇన్నాళ్లు సరిహద్దులు దాటి కర్నాటక మద్యం తరలించి పేద వర్గాలనే టార్గెట్ చేసి విక్రయిస్తుండగా.. తాజా పేకాట స్థావరాలు వెలుగుచూడడంతో స్థానికుల్లో అసహనం వ్యక్తమవుతోంది. సాధారణ, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు పేకాటలో పెద్ద మొత్తంలో సొమ్ము పోగొట్టుకుని, చిన్నాభిన్నం అవుతున్నారని పలువురి నుంచి అందిన సమాచారం.

శివారుల్లో ఇన్‌ఫార్మర్లతో పర్యవేక్షణ

పోలీసుల రాకను ముందే పసిగట్టేందుకు శివారు ప్రాంతాల్లో జూదరులు తమ ఇన్‌ఫార్మర్‌లను నియమించుకున్నారట. సరిహద్దు ప్రాంతాల్లో రోజుకో ప్రాంతాన్ని ఎంచుకొని పేకాట స్థావరాలు ఏర్పాటు చేసి పెద్ద సంఖ్యలో జూదరులకు ఆహ్వానం పలుకుతున్నట్లు స్థానికులు చెబుతున్న మాట. సుదీర్ఘకాలంగా పోలీస్‌స్టేషన్‌లో ఉన్న కొంతమంది సిబ్బంది వారికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారుల రాకను వారి నుంచే జూదరులు సమాచారం అందుకొని పారిపోతారని బోగట్టా.

పట్టుబడ్డ ఆ పదిమందిపై నో కేస్?

గంగవరం మండల గంగరాజుపల్లి పంచాయతీ పరిసరాలు, పెద్దపంజాణి మండలం శంకర్రాలిపేట శివాజీ శివారు ప్రాంతాల్లో ఇటీవల పేకాట స్థావరాలు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. సరిగ్గా మూడు రోజుల కిందట 10మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం ఉంది. అయితే వారిపై కేసు నమోదు, తదుపరి చర్యల లేకపోయిందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంగా పోలీసుల్లోనూ దాటవేసే దోరణి కనిపిస్తోంది. ఇకనైనా ఉన్నాతాధికారులు దృష్టి సారించి పేకాట రాయుళ్ల భరతం పట్టాలని పలువురు కోరుతున్నారు.

వీధి కుక్కల దాడిలో యాచకునికి గాయాలు

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు బస్టాండులో వీధి కుక్కల దాడిలో సోమవారం ఓ యాచకునికి తీవ్ర గాయాలపాలైయ్యాడు. తీవ్ర రక్తగాయాలు కావడంతో స్థానికులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని రాజుపేట సమీప పంట పోలాల వద్ద ఓ వృద్ధుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వెలుగుచూసింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. రామకుప్పం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడిది కర్ణాటక రాష్ట్రం, క్యాసంబళ్ళ హెబ్లీ, బలవనహళ్లి గ్రామానికి చెందిన గంగప్ప(89)గా గుర్తించారు. భార్య లక్ష్మమ్మ రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో గంగప్ప మనస్థాపానికి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-పలమనేరు: అక్రమంగా కర్నాటక మద్యం తరలిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకొన్నట్లు ఎస్ఐ స్వర్ణతేజ తెలిపారు. సోమవారం వివరాలను వెల్లడిస్తూ.. ముందుగా అందిన సమాచారం మేరకు.. పలమనేరు-మదనపల్లి రహదారిలోని గుండుబావి వద్ద వాహనాలు తనిఖీ చేశామన్నారు. స్కూటీలో మద్యం తరలిస్తున్న యువకుడిని గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. అతనిది ముసలిమడుగుకు చెందిన తేజగా గుర్తించామన్నారు. అతని వద్ద నుంచి 480టెట్రా మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.